Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

11వ వార్షికోత్సవం 2016 - 2026
మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

సంపుటి : 160
సంచిక : 280
పేజీలు : 3

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

బుధవారం, జూన్ 24, 2026

## కూతురును సర్కారు బడిలో చేర్చిన సర్పంచ్



**టీ మీడియా, జూన్ 23, కారేపల్లి**

సర్కార్ బడులలో నాణ్యమైన విద్యా, ఉచిత పాఠ్య నోట్ బుక్స్ అందిస్తున్నాయని వాటిని సింగరేణి మండలం విశ్వనాథపల్లి సర్పంచ్ ఇస్లావత్ రాజు పదిమందికి చెప్పటమే కాకుండా తన కూతురును సర్కారు బడిలో చేర్చి ఆదర్శంగా నిలిచారు. సర్పంచ్ రాజు కుమార్తె ఇస్లావత్ రవళి ఓ ప్రైవేటు స్కూల్లో చదువుతోంది. విశ్వనాథపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయ బృందం ఇటీవల నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో గ్రామంలో ప్రదర్శన నిర్వహించి ప్రతీ ఇంటికి వెళ్లారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమానికి ఆకర్షితుడైన సర్పంచ్ ప్రభుత్వ పాఠశాలపై ప్రజలకు నమ్మకం కల్పించాలని ఉద్దేశంతో తన కూతురును ప్రభుత్వ బడిలో చేర్చేందుకు నిర్ణయించుకున్నాడు. విశ్వనాథపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్ లో మంగళవారం చేర్పించారు.

## మంచి పనులకు సహకారం
## పరిధి దాటితే చర్యలు

- **వైరా ఎస్ఐ రామారావు**

**టీ మీడియా, జూన్ 23, వైరా**

విద్యార్థులు మంచి పనులు చేస్తే పోలీస్ సహకారం ఉంటుందని, క్రమశిక్షణ దాటి వ్యవహరిస్తే చర్యలు తప్పవని వైరా పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ పి.రామారావు అన్నారు. బుధవారం వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వాసం వీరస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ పాల్గొని ప్రసంగించారు. భారత దేశ భవిషత్ విద్యార్థులు, యువతపై ఆధారపడి ఉంటుందని అన్నారు. అందుకే మహనీయులు నేటిబాలలే రేపటి పౌరులని అన్నారని, ఆ సూక్తి నేటికీ రెలవెంట్గా ఉన్నదని అన్నారు. విద్యార్థులు మంచి ప్రవర్తనతో దేశభక్తి గల పౌరులుగా ఎదగాలని విజ్ఞప్తి చేశారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జీవితాలను అంధకారం చేస్తాయని హెచ్చరించారు. జీవితంలో ఒక్క రిమార్క్ పడితే ఆ తర్వాత ఎన్ని గొప్ప పనులు చేసినా ఆ రిమార్క్ ను చెరిపివేయలేదని స్పష్టం చేశారు. వైరా టౌన్ ఎస్ఐ పవన్ మాట్లాడుతూ, విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు, ఇతర మత్తుపదార్థాలకు అలవాటు పడరాదని, సరదా అలవాట్లే మిమ్మల్ని బానిసలుగా మార్చుకుంటాయని హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలను సరఫరా చేసే బ్యాచీలు మన మధ్యనే ఉండి యువతను ఆకర్షించి జీవితాలను బుగ్గిపాలు చేస్తుంటాయని, అటువంటి వారి సమాచారం 1908 ద్వారా తమకు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విత్తన మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

### -ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్



**టీ మీడియా, జూన్ 23,పాల్వంచ:**రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం జూన్ 23 నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో నిర్వహిస్తున్న విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. మంగళవారం పాల్వంచ మండలం జగన్నాథపురం రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మేళాలో ఏర్పాటు చేసిన విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించి, విత్తనాల ప్యాకెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి వాటి ప్రామాణికతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరించిన, నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై సరసమైన ధరలకు అందించేందుకు వ్యవసాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. రైతు వేదికలలో నిర్వహిస్తున్న ఈ విత్తన మేళాల్లో సన్న రకాల వరి విత్తనాలు, పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక వ్యవసాయ ఉత్పత్తులు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలోని 43 రైతు వేదికల ద్వారా విత్తన మేళాలు నిర్వహిస్తున్నామని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు. యూరియా బుకింగ్‌ను కూడా యాప్ ద్వారా నిర్వహిస్తున్నామని, రైతులు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. యూరియా బుకింగ్ యాప్, విత్తనమేలపై రైతులలో అవగాహన కలిగించాలని వ్యవసాయ శాఖ అధికారులని ఆదేశించారు.

నకిలీ విత్తనాల విక్రయం, విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, వ్యవసాయ అవసరాలన్నీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విత్తన మేళా ద్వారా విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు, యూరియా బుకింగ్ ద్వారా యూరియా బుక్ చేసుకున్న రైతులకు కలెక్టర్ చేతులమీదుగా విత్తనాలు, యూరియా అందించారు.

ఈ కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, సోసిటీ ఛైర్మెన్ కొత్వాల శ్రీనివాస్, తాసిల్దార్ ధారా ప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గ్రామాలకు రూ.110 కోట్లు ఇవ్వండి

### -కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ

**టీ మీడియా, జూన్ 23,ఖమ్మం:**ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలంలో ఏజెన్సీ, గిరిజన గ్రామ పంచాయతీలకు వరద నీటి కాలువలు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణం కోసం రూ.110 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత–జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. సోమవారం రాసిన ఈ లేఖలో మండలంలోని డ్రైనేజీ సమస్యలను మంత్రి వివరించారు. మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో 28 ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల పరిధిలోకి వస్తాయని మంత్రి తెలిపారు. వర్షాకాలంలో సరైన వరద నీటి కాలువలు లేక ఈ గ్రామాలు తీవ్ర నీటి నిల్వ,

2లో



# జూపల్లికి తెలివి ఉందా..?

### -డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు



**టీ మీడియా ,జూన్ 23, అశ్వారావుపేట :** మేమిచ్చిన పంటల బోనస్ 3 సార్ల రైతు బంధు కంటే ఎక్కువ అని మంత్రి జూపల్లి కృష్ణారావు అంటుండు. అసలు జూపల్లికి తెలివి ఉందా..? అని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. రెండు బోనస్‌లు అయితే ఎగ్గొట్టినవ్.. పోయిన యాసంగి బోనస్ రూ.1200 కోట్లు, ఈ యాసంగి బోనస్ రూ. 1000 కోట్లు ఎగ్గొట్టినవ్ అని సీఎం రేవంత్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. అంతగొడితే నువ్వు బోనస్ ఇచ్చింది రూ.2500 కోట్లు.. కానీ మీరు ఎగగొట్టిన రైతు బంధు విలువ రూ.29,350 కోట్లు అని ధ్వజమెత్తారు. జూపల్లి తెలుసుకో లెక్క. చర్చ పెడదామా.. అసెంబ్లీకి వచ్చి మాట్లాడదాం. నువ్వు ఇచ్చిన బోనస కేవలం 3 వేల కోట్లు కూడా దాటదు. నువ్వేమైనా తెలిసి మాట్లాడుతున్నవా.. తెలియక మాట్లాడుతున్నవా..? చిన్న మెదడు ఏమైనా చితికిపోయిందా..? నాకైతే అర్థమైతలేదన్నారు హరీశ్ రావు .సీఎం రేవంత్ రెడ్డి మాటలకు ఎక్కువ.. చేతలకు తక్కువ. ఆయన దగ్గర మూడు శాఖలున్నాయి. విద్యాశాఖ, హోంశాఖ, మున్సిపల్ శాఖ.. ఈ మూడింటిలో కూడా అట్టర్‌ఫ్లాప్ అయిందని హరీశ్ రావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులుండి చేసింది గుండుసున్నా. రేవంత్ రెడ్డి మూడు శాఖలు పెట్టుకుని చేసింది కూడా

3లో

# భారీగా ఎస్‌డబ్ల్యుఎఫ్‌లో చేరికలు

### -డిపో కమిటీ ల పరిష్కారం కోసం పనిచేయాలి
### -వజ్రాల శ్రీనివాసరావు,గడ్డం లింగమూర్తి



**టీ మీడియా ,జూన్ 23,సత్తుపల్లి:** ఆర్టీసీ లో ఐక్యత పోరాటం నినాదంతో ఐక్య పోరాటాల వేదికగా ఆవిర్భవించిన స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ను ఆర్టీసీ కార్మికులందరూ బలపరచాలని,ఎస్ డబ్ల్యూ ఎఫ్ నూతన సత్తుపల్లి డిపో కమిటీ డిపో లోని మొత్తం కార్మికులందరి సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలని,నూతన డిపో కమిటీకి నూతనంగా డిపోలోని గ్యారేజ్,ట్రాఫిక్ సెక్షన్ లో వివిధ యూనియన్ల నుండి ఫెడరేషన్ లో చేరిన వారికి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు,ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి లు అభినందనలు తెలిపారు. మంగళవారం ఉదయం సత్తుపల్లి లోని కళాభారతి ఆడిటోరియంలో ఏర్పాటైన సత్తుపల్లి డిపో 11వ మహాసభలో డిపో కమిటీ అధ్యక్షులు ప్రభాకర్ జండా ఆవిష్కరణ చేసి సభకు అధ్యక్షత వహించారు. ఎం.పద్మావతి అతిథులను వేదిక మీదికి ఆహ్వానించారు. జొన్నలగడ్డ జగన్నాథం సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా హాజరైన ప్రతినిధులందరూ మౌన పాటించి నివాళులర్పించారు. మావల్లే సమ్మె జయప్రదం అయిందని




3లో




## విబి జీ రాం జీ పథకాన్ని రద్దు చేయాలి

**సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**

**టీ మీడియా ,జూన్ 23,ఖమ్మం :** వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గర్ అండ్ అజీవిక మిషన్ (విబిజి రాంజీ) పథకం గ్రామీణ పేదల ఉపాధిని దెబ్బతీసేవిధంగా రూపొందించారని ఈ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. గతంలో ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సవరించి నూతనంగా పలు నిబంధనలను చేర్చారని ఈ నిబంధనలతో ఉపాధి కరువవుతుందని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం భారతీయ కేత్ మద్దూర్ యూనియన్ పిలుపు –మేరకు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విబిజీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలని దాని స్థానంలో తిరిగి –మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని, పని దినాలను పెంచాలని, దినసరి కూలీ రూ.700 గిట్టుబాటు అయ్యేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, –ఆదినారాయణ, మిడికంటి చిన్నవెంకటరెడ్డి, ఏనుగు గాంధీ, యంగళ ఆనందరావు, ప్రజా సంఘాల నాయకులు తాటి నిర్మల, –పగిళ్ల వీరభద్రం, సత్యనారయణ, వీరబాబు, సుధాకర్, గోపాలరావు, మహేష్, ఈశ్వరమ్మ, రంజాన్బీ పాల్గొన్నారు. ధర్నా అనంతరం డిమాండ్స్ కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్కు అందజేశారు.

## గిరిజన గ్రామాలకు రూ.110 కోట్లు ఇవ్వండి

పారిశుధ్య సమస్యలను ఎదుర్కొంటున్నాయని, గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా వరద నీటి కాలువలు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణానికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పనులకు రూ.110 కోట్లు అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తన నియోజకవర్గ పరిధిలోని ఈ గిరిజన ప్రాంతాలకు సరిపడా స్థానిక వనరులు లేనందున, గ్రామీణాభివృద్ధి లేదా గిరిజన ప్రాంత అభివృద్ధి పథకాల ద్వారా నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని తుమ్మల కోరారు.ప్రతిపాదిత పనులు ఈ గిరిజన ప్రాంతాల్లో పారిశుధ్యం, ప్రజారోగ్యం, జీవన పరిస్థితులు, మొత్తం మౌలిక సదుపాయాలను గణనీయంగా మెరుగుపరుస్తాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. డీపీఆర్‌తో పాటు గ్రామ పంచాయతీల జాబితాను లేఖకు జతచేస్తూ, నిధుల మంజూరుకు సానుకూలంగా స్పందించాలని కేంద్ర మంత్రిని ఆయన అభ్యర్థించారు.

చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.ఆర్టీసీ కార్మికులు వాస్తవాలు తెలుసుకున్నారని ఎస్డబ్ల్యూఎఫ్ లో చేరికలే అందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

# ప్రారంభమైన విత్తన మేళా

**రైతు వేదికల్లో అవగాహన సదస్సులు**



**టీ మీడియా,జూన్23,సింగరేణి(కారేపల్లి):** ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలోని అన్ని రైతు వేదికల వద్ద మంగళవారం "రైతు ముంగిట్లో నాణ్యమైన విత్తనాలు" కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన విత్తన మేళా, అవగాహన సదస్సుల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు,ఆధునిక సాగు పద్ధతులు,ఎరువుల వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పించారు.వ్యవసాయ శాఖ అధికారులు,విత్తనాలు, ఎరువులు,పురుగుమందుల డీలర్లు రైతులకు నానో యూరియా,నానో డీఏపీ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.అలాగే వివిధ రకాల పప్పుధాన్యాలు,నూనెగింజ పంటలు,కూరగాయల విత్తనాలు,ఇతర వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శిస్తూ వాటి సాగు విధానాలను తెలియజేశారు.ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్న రకాల వరి విత్తనాలను రైతులకు చూపించి,బోనస్‌కు అర్హత కలిగిన వరి రకాలపై అవగాహన కల్పించారు.ఒకే రకమైన పంటల సాగుకు పరిమితం కాకుండా పప్పుధాన్యాలు,నూనెగింజల పంటలను సాగు చేయాలని సూచించారు.పంట మార్పిడి విధానం వల్ల భూసారం పెరగడం,తెగుళ్ల తగ్గడం,దిగుబడులు మెరుగుపడడం వంటి ప్రయోజనాలను వివరించారు.అదేవిధంగా పంట కోత అనంతరం వచ్చే పంట అవశేషాలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలని,దీనివల్ల భూసారం పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని రైతులకు సూచించారు.మండలంలోని రైతులకు రైతు వేదికల వద్దే నాణ్యమైన విత్తనాలు,పప్పుధాన్యాల విత్తనాలు,ఆధునిక ఎరువుల వినియోగంపై పూర్తి సమాచారం అందించడంతో పాటు వ్యవసాయ రంగంలో కొత్త సాంకేతికతలను పరిచయం చేశారు.ఈ కార్యక్రమంలో సింగరేణి మండల వ్యవసాయ అధికారి బట్టు అశోక్ కుమార్,ఆయా గ్రామాల సర్పంచులు,ఉపసర్పంచులు,వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు)మున్నీ,నరేష్, మహేష్,చంద్రకళ,ఆయా గ్రామపంచాయతీ సెక్రటరీలు,విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు.



## సింగరేణిలో పారిశుధ్యంపై డ్రోన్ సర్వే

**సాంకేతికతతో పారిశుధ్య నిర్వహణకు శ్రీకారం**



**టీ మీడియా,జూన్23,సింగరేణి(కారేపల్లి):**వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సింగరేణి గ్రామపంచాయతీలో పారిశుధ్య నిర్వహణకు సాంకేతికతను జోడిస్తూ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) వినూత్న చర్యలకు శ్రీకారం చుట్టారు.సోమవారం గ్రామంలో డ్రోన్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు.ఈ సర్వేలో నీరు నిల్వ ఉండే ప్రాంతాలు,డ్రైనేజీ వ్యవస్థ,అంతర్గత రహదారుల పరిస్థితి,విద్యాసంస్థల పరిసరాలు తదితర అంశాలను డ్రోన్ కెమెరా ద్వారా చిత్రీకరించారు.వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు చేపట్టేందుకు ఈ సర్వే ఉపయోగపడనుంది.ఈ సందర్భంగా సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) మాట్లాడుతూ,వర్షాల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుధ్యం,డ్రైనేజీ,రహదారులు,పాఠశాలల భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.డ్రోన్ సర్వే ద్వారా గుర్తించిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు.గ్రామ ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి,పంచాయతీ కార్యదర్శి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి.

**టీ.మీడియా,జూన్23,చింతూరు:**భారతీయ జన సంఘ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన, మహోన్నత జాతీయవాది డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి ని మంగళవారం చింతూరులో ఘనంగా నిర్వహించారు. చింతూరు యస్ టి కాలనీ 12 వ వార్డు,బూత్ నెం 346 లో మాజీ బిజెపి మండల అధ్యక్షులు డి వి యస్ రమణ రెడ్డి(చిట్టిబాబు )ఆధ్వర్యంలో ముఖ్య అతిథి గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పాయం. వెంకయ్య ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూదేశ సమైక్యత, జాతీయత, దేశాభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయమైనవని కొనియాడారు . ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి బీజేపీ కార్యకర్త కట్టుబడి ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు తుర్రం అశోక్ కుమార్ దొర, జారీ. బొజ్జమ్మ, కాశి, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.



## సిపిఐ నేతలను వెంటనే విడుదల చేయాలి

**-జిల్లా కార్యదర్శి బి విజయ సారథి డిమాండ్**

**టిమీడియా, జూన్23, కురవి:**

మానుకోట జిల్లా కేంద్రంలో అనంతరం మోడల్ స్కూల్ వద్ద భూ పోరాటం కేంద్రం వద్ద నేడు తెల్లవారుజామున పేదలు వేసుకున్న గుడిసెలను పోలీసులు అక్రమంగా కూల్చుతుంటే అడ్డుకున్న సిపిఐ మహబూబాబాద్ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ సహాయ కార్యదర్శి 18వ వార్డు కౌన్సిలర్ రేశపల్లి నవీన్ పట్టణ నేతలు కూరాకుల మంద శంకర్ బాలాజీ లను అక్రమంగా పోలీసులు అరెస్టు చేసి కురవి పోలీస్ స్టేషన్ కు తరలించగా కురవికి వెళ్లి పోలీస్ స్టేషన్ లో సిపిఐ నేతలను సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి పరామర్శించారు .ఈ సందర్భంగా బి విజయ సారథి మాట్లాడుతూ వెంటనే అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు .అరెస్టు చేసిన పెరుగు కుమార్ రట?శ పల్లి నవీన్ కూరాకుల పాల్ మంద శంకర్ బాలాజీ లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో కొరివి పార్టీ నేతలు కురవి టౌన్ కార్యదర్శి తురక రమేష్ కన్నెంవెంకన్న బుడమ వెంకన్న ఉన్నారు.

## పోస్టల్ శాఖ ఉద్యోగుల నిరసన ధర్నా



**టీ.మీడియా,జూన్23,చింతూరు:**అఖిలభారత గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ( ఎ ఐ జి డి ఎస్ యు ) ( పోస్టల్ డిపార్ట్మెంట్ )పిలుపుమేరకు మంగళవారం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన ధర్నాలు ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని రాజమండ్రి డివిజనల్ సెక్రటరీ పైడిశెట్టి భూలోకం పిలుపునిచ్చారు. ఈ పిలుపుమేరకు మంగళవారం చింతూరు సబ్ డివిజన్ లోని గ్రామీణ పోస్టల్ శాఖ ఉద్యోగులు చింతూరులోని సబ్ పోస్ట్ ఆఫీస్ ముందు పోస్టల్ ఉద్యోగి అల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తమ డిమాండ్ల సాధన కోసం నిరసన తెలుపుతూ ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్స్ అయినగ్రామీణ పోస్టల్ శాఖ ఉద్యోగులకు 8వ కేంద్ర వేతన కమిషన్ పరిధిలో చేర్చడం, లేదా ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని, అలాగే సాధారణ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టాలని, 1972 ప్రకారం గ్రాడ్యుటి మంజూరు చేయాలని,, జాతీయ ఉద్యోగులకు లభించే ప్రయోజనాలకు సమానమైన ప్రయోజనాలతో గ్రామీణ పోస్టల్ ఉద్యోగస్తులను రెగ్యులర్ చేయాలని, సుప్రీం కోర్ట్ 2004 ముందు చేసిన సూత్రాల ప్రకారం పాత పెన్షన్ ప్రయోజనాలను లెక్కించాలని, అలాగే 8 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టాలని,, అంతకంటే ఎక్కువ పని చేస్తున్న వాస్తవ పరిస్థితిని గుర్తించాలని, అదనంగా నిర్వహించే పనికి అదనంగా పారితోషికం పెంచాలని కోరారు. కేంద్ర మాజీ జనరల్ సెక్రెటరీ ఎస్ఎస్ మహాదేవయ్య ను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు. అలాగే పోస్టల్ శాఖ ఉద్యోగులపై, నాయకులపై జరుగుతున్న కక్ష సాధింపు, ప్రతీకార చర్యలను ఉపసంహరించుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అల్లి శ్రీనివాసరావు తో పాటు, పులి వెంకటనారాయణ, బాదం దుర్గాప్రసాద్, మణికంఠ( రామవరం) క్రాంతి వర్ధన్, శ్రీనివాస్, మణికంఠ( రామవరం)రాజు ( లక్కవరం) తదితరులు పాల్గొన్నారు.

